సాక్షి
కర్నూలు
ఆదివారం ׀ 9 ׀ జూన్ ׀ 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థాన నిత్య అన్నదాన పథకానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన పెసర శ్రీధర్ రెడ్డి రూ.1,00,101 విరాళాన్ని ఆలయ ఏఈఓ ఫణిధర ప్రసాద్‌కు అందజేశారు.



కాలుష్య కోరలు!

కర్నూలు నగరంలో పాటు పట్టణాల్లో సూక్ష్మధూళికణాలు పరిమితి కంటే చాలా ఎక్కువ విడుదలవుతున్నాయి. దీంతో ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడే ప్రమాదం నెలకొంది. 8లో▸



అదుపు తప్పిన ట్రాక్టర్

ట్రాక్టర్ అదుపుతప్పి ఎస్ఆర్‌బీసీ కాలువలో పడింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. శనివారం అలగనూరు గ్రామం శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

డీసీసీబీ చైర్‌పర్సన్ పదవికి విజయమనోహరి రాజీనామా

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని జిల్లా సహకార అధికారి రామాంజనేయులుకు అందజేశారు. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం 2023 జూలైలో ఆమెను డీసీసీబీ చైర్‌పర్సన్‌గా నియమించింది. అదే నెల 17న పదవీ బాధ్యతలు చేపట్టారు. స్వల్ప వ్యవధిలోనే డీసీసీ బ్యాంకును లాభాల బాట పట్టించేందుకు ఎంతో కృషి చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ ఓటమి పాలవడంతో ఆమె తన పదవికి రాజీనామా చేశారు. చైర్‌పర్సన్‌గా విధి నిర్వహణలో సహకరించిన బ్యాంకు అధికారులు, మేనేజర్లు, పీఏసీఎస్ చైర్మన్‌లు, సీఈవోలు, జిల్లా సహకార అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కేసీలో జల పరవళ్లు



కేసీలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

పగిడ్యాల: ఇటీవల కురుస్తున్న వర్షాలకు కర్నూలు–కడప కాలువ(కేసీ కెనాల్) జలకళను సంతరించుకుంది. కాలువలోకి 1000 క్యూసెక్కుల నీరు వచ్చి ఉంటుందని అధికారుల అంచనా వేశారు. కేసీలో పారుతున్న వరద నీటిని చూసిన ఆయకట్టు రైతులు మొక్కజొన్న, పత్తి, మినుము తదితర పంటలను విత్తుకుంటున్నారు. కేసీలోకి చేరిన వరద నీరు రెండు రోజుల్లో తగ్గిపోతుందని, ముచ్చుమర్రి, పగిడ్యాల గ్రామాల వద్ద బ్రిడ్జీలను త్వరలోనే పూర్తి చేస్తామని నీటిపారుదల శాఖ నందికొట్కూరు సెక్షన్ ఏఈఈ నరేష్ శనివారం విలేకరులకు తెలిపారు.

ఒక్క రోజు ఆదాయం రూ.7.8 లక్షలు

బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామికి వివిధ సేవల ద్వారా శనివారం రూ.7,81,770 ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. జ్యేష్ఠ మాసం శుభదినాలను పురస్కరించుకొని స్వామి దర్శనార్థం జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన



గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించిన మహిళలు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని మేజర్ గ్రామపంచాయితీ కార్యాలయం ఎదుట శనివారం తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఎస్సీ కాలనీ ప్రజలు నిరసన తెలిపారు. ఖాళీ బిందెలతో కార్యాలయం ఎదుట బైఠాయించారు. ట్యాంకర్లతో సరఫరా చేస్తున్న నీరు ఏమాత్రం సరిపోవడం లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆరోపించారు. నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని ఈఓ ఆనంద రావు తెలపడంతో నిరసన విరమించారు. కాలనీవాసులు ప్రతాప్, వెంకటాద్రి, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లొక్కిగుండం.. ప్రకృతి సోయగం



కొలిమిగుండ్ల: ఎర్రమల కొండల్లోనుంచి జాలువారుతున్న జలపాతం.. కింద గుండలో నీలి రంగులో నీరు.. కొలిమిగుండ్ల మండలంగొర్విమానుపల్లె సమీపంలోని లొక్కిగుండం రామేశ్వరస్వామి ఆలయం చెంత ఉన్న జలపాతం ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వర్షాలు కురుస్తుండటంతో ఎగువ ప్రాంతాల నుంచి నీరు గుండంలోకి దూకుతూ కనువిందు చేస్తున్నాయి. రామేశ్వరస్వామి ఆలయం ఉండటంతో చాలా మంది భక్తులు ఇక్కడికి వస్తుంటారు. సెలవులు, ఇతర దినాల్లో ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు కుటుంబ సభ్యులతో చేరుకొని గుండంలో జలకాలాడుతుంటారు. వేసవిలోను గుండంలో నీళ్లు ఉంటాయి. అవి ఎక్కడి నుంచి వస్తున్నాయనేది ఇప్పటి వరకు ఎవరూ గుర్తించలేక పోయారు.

కొత్తగా రెక్కలొచ్చైనా..!

- ప్రారంభమైన జూనియర్ కాలేజీలు
- భవిష్యత్తుకు ఈ దశే కీలకం
- గాడితప్పితే జీవితమే గందరగోళం
- చెడు వ్యసనాలను దరి చేరనివ్వకూడదు
- క్రమశిక్షణతో సాగితే విజయం ఖాయం

➡ కర్నూలు నగరానికి చెందిన ఓ విద్యార్థి రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివి పదో తరగతిలో మంచి మార్కులు సాధించాడు. కాలేజీలో చేరిన తర్వాత పూర్తి స్వేచ్ఛ రావడంతో చదువును నిర్లక్ష్యం చేశాడు. స్నేహితులతో కలసి వ్యసనాలకు బానిసయ్యాడు. ఫలితంగా ఇంటర్ మొదటి సంవత్సరంలో మూడు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాడు. తల్లిదండ్రుల మందలింపులు..తోటి మిత్రుల అవహేళనలను ఎదుర్కోవాల్సి వచ్చింది.

➡ నంద్యాల పట్టణానికి చెందిన ఓ బాలిక పదో తరగతిలో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. తల్లిదండ్రులు కాలేజీలో చేర్పించగా కొందరి మాటలు విని చదువును నిర్లక్ష్యం చేసింది. సెల్‌ఫోనుకు బానిసై పాఠ్యాంశాలను చదవకుండా వదిలేయడంతో ఫైనల్ పరీక్షల్లో ఫెయిలైంది. 'పది'లో పాసైనప్పుడు మెచ్చుకున్నవారే ఎగతాళిగా మాట్లాడటాన్ని ఆ బాలిక జీర్ణించుకోలేకపోయింది. దీంతో మనస్తాపం చెంది బలవన్మరణానికి పాల్పడింది.

..వీరిద్దరే కాదు, చాలా మంది అమాయకత్వంతో ఇంటర్‌మీడియట్‌లో జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అవగాహన రాహిత్యంతో చదువులో రాణించలేకపోతున్నారు. కొత్తగా ఏర్పడిన స్నేహాలు.. కొందరి ప్రోద్బలంతో వ్యసనాలకు బానిసవుతున్నారు. ఒక ప్రణాళిక లేకుండా..ఇష్టమొచ్చినట్లుగా తిరుగుతూ..కలల్లో విహరిస్తూ, వాస్తవాన్ని తెలుసుకోకుండా భవిష్యత్తు అంధకారం చేసుకుంటున్నారు.



కర్నూలు (సిటీ): మొన్నటి వరకు మోసిన బరువైన బ్యాగ్ తేలికైపోతుంది.. కొత్త పాఠ్యాంశాలు తెరపైకి వస్తాయి.. ఇష్టంగా తీసుకున్న గ్రూపు.. నూతన పరిచయాలు.. ఒక్కసారిగా కళాశాల వాతావరణం అనుభవంలోకి వస్తుంది. అప్పటి వరకు తల్లిదండ్రుల చాటు బిడ్డలుగా ఉన్న పిల్లలు ఒక్కసారిగా స్వేచ్ఛా ప్రపంచంలోకి వస్తారు. కొత్త పరిసరాలు.. సరికొత్తగా అనిపించే ఆలోచనలు వింతగా అనిపిస్తా విద్యార్థికి ఇంటర్మీడియెట్ దశ అత్యంత కీలకం. ఒక ప్రణాళిక ప్రకారం చదివితే జీవితాన్ని మలుపు తిప్పుకోవచ్చు. అయితే ఈ దశలో అన్నీ తెలిసినట్టే అన్పిస్తుంది, కానీ ఏమీ తెలియని తనం ఆవహిస్తుంది. ఏ మాత్రం తొందరపాటు నిర్ణయాలు తీసుకున్నా.. జీవితం అధకారంలోకి వెళ్తుంది. పరాజయంతో కుంగిపోవాల్సి వస్తుంది. జిల్లాలో జూనియర్ కళాశాలలు ప్రారంభమయ్యాయి. ఈ దశలో విద్యార్థులు జాగ్రత్తలు పాటిస్తూ ముందుకు సాగాలి. భవిష్యత్తును బంగారు బాటలు వేసుకోవాలి.

ప్రాధాన్యం చదువుకే ఇవ్వాలి

ఆర్కిటెక్చర్, ఫార్మసీ, అగ్రికల్చర్, లా, ఫైన్ ఆర్ట్స్.. ఇలా ఏ కోర్సుకైనా తొలి అడుగు పడాల్సింది ఇంటర్‌లోనే. కళాశాల జీవితం సక్రమంగా సాగితే ఒక బంగారు లోకమవుతుంది. తప్పటడుగులు వేస్తే కోలుకోలేని దెబ్బ తగులుతుంది. క్రమ శిక్షణతోనే సాగితే అనుకున్నది సాధించవచ్చు. అయితే ఇంటర్‌లో విద్యార్థులు ఎన్నో అంశాలకు ఆకర్షితులవుతారు. తొలి ప్రాధాన్యం చదువుకే ఇవ్వాలి. సినిమాల్లో చూపించినట్లుగా కాలేజీ ఎగ్గొట్టడం హీరోయిజం కాదనే విషయాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలి. విధిగా తరగతులకు హాజరు కావాలి. పాఠ్యాంశాలపై దృష్టి సారించాలి. అధ్యాపకులిచ్చే నోట్స్‌ను ఎప్పటికప్పుడు రాసుకోవాలి., పోటీ పరీక్షలకు అనుగుణమైన ప్రణాళిక రూపొందించుకుకోవాలి. స్నేహితులతో కలిసి చదువుకోవడం ఉపయుక్తకరంగా ఉంటుంది.

సమయం విలువైనది

విద్యార్థులకు పండగే. అయితే వాటిని సద్వినియోగం చేసుకోగలిగితే విద్యార్థి ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించవ్చు. ఆయా సమయాల్లో వారు ఎంచుకునే వ్యాపకాలే భవిష్యత్తును నిర్దేశిస్తాయి. మనసును, శరీరాన్ని ఉల్లాసపరిచే మంచి క్రీడలు, లైబ్రరీలో పుస్తక పఠనం, స్నేహితులతో సబ్జెక్టులపై చర్చ, శృతిమించని వినోదం వంటివి ఆహ్లాదంతో పాటు జీవితాన్ని ఆనందమయం చేస్తాయి.

స్నేహమెంతో మధురం

చేరగానే విద్యార్థులను ప్రభావితం చేసే తొలి అంశం స్నేహం. అదృష్టం కొద్దీ అది ఉన్నత భావాలున్న వారితో కుదిరితే జీవితం ప్రభావితం అవుతుంది. లేదంటే ప్రమాదంలో పడుతుంది. పశ్చాత్తాపం పడేలా చేస్తుంది. చదువుపై ఇష్టం, పెద్దలపై గౌరవం, సమాజం మీద అవగాహన, ఆధ్యాపకులపై సదాభిప్రాయం ఉన్న వారితో స్నేహం చేయాలి. అలాంటి దృక్పథంలోనే ముందుకు సాగాలి.

కళాశాల పేరు	విద్యార్థుల సంఖ్య
ప్రభుత్వ	9,330
మోడల్ స్కూల్	3,693
సోషల్ వెల్ఫేర్	1,274
ట్రైబల్ వెల్ఫేర్	0
బీసీ వెల్ఫేర్	205
ఏపీఆర్‌జేసీ	334
కేజీబీవీ	1,018
ఎయిడెడ్	983
ప్రైవేటు	30,064
మొత్తం	46,901

స్వేచ్ఛను దుర్వినియోగం చేయొద్దు

కాలేజీ దశలో ప్రమాదకరమైన వ్యసనాలు అలవాటు అయ్యే అవకాశాలు ఉన్నాయి. వాటి నుంచి తప్పించుకోవాలి. సిగరెట్లు, గుట్కాలు, మద్యం వంటి వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మేలు. సెల్‌ఫోన్ వైరస్ విద్యార్థుల ప్రగతికి అవరోధంగా మారుతుంది. తరగతి గదుల్లో చదువుకునే వేళల్లో అనవసరమైన కబుర్లకు అలవాటు పడేలా చేస్తాయి. పరిచిత, అపరిచిత వ్యక్తులతో చాటింగ్ మోజులో పడొద్దు. నెట్ అలవాటు విషయంలోను విద్యార్థులకు జాగ్రత్త అవసరం. అశ్లీలత వైపు మనసు మళ్లితే అంతే సంగతులు. పార్టీలు, వేడుకల పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు ప్రేరేపించే అవకాశం ఉంటుంది. జాగ్రత్తగా ఉండాలి. సినిమాల ప్రభావంతో, స్నేహితుల ప్రోత్సాహంతో ప్రేమాయణమంటూ మనసు కలుషితం చేసుకోవద్దు. దారి తప్పి భావి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. స్నేహితులే లోకంగా అన్పించే వయస్సులో వారికి అతి ప్రాధాన్యం ఇస్తూ తల్లితండ్రుల, ఆధ్యాపకులను నిర్లక్ష్యం చేయకూడదు. తల్లితండ్రులు ఇచ్చే స్వేచ్ఛను దుర్వినియోగం చేయొద్దు.

కీలక అడుగులన్నీ ఇక్కడే!

తొలిసారి ఎదుర్కొన్న పబ్లిక్ పరీక్షల్లో విజయం సాధించామన్న ఆత్మవిశ్వాసం.. పాఠశాలను దాటి కళాశాలను చేరామన్న ఉత్సాహం.. కొత్త పరిచయాలు, కళాశాల వాతావరణం కల్గించే ఆనందం వెరసి విద్యార్థులకు ఇంటర్మీడియెట్ దశ ఓ కొత్త బంగారు లోకమే. అనువైన గ్రూపు, ఇష్టమైన సబ్జెక్టులు చదివే తొలి స్వేచ్ఛా దశ ఇదని చెప్పవచ్చు. జీవితంలో కీలక అడుగులన్నీ ఇంటర్‌లోనే పడతాయనడంలో అతిశయోక్తి లేదు. ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ ఫలితాలు సాధించినా, గాడి తప్పి అథఃపాతాళానికి పడిపోయినా అందుకు ఇంటర్‌లోనే బీజాలు పడతాయని చెప్పుకోవచ్చు. హైస్కూల్ విద్యతో మొదలయ్యే కౌమార ప్రాయం ఇంటర్‌లో మరింత పురి విప్పుతుంది. అందుకే జాగ్రత్త పడాలి.

లక్ష్యం దిశగా ముందుకు సాగాలి



పిల్లలు వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు, పెద్దలు చెప్పినట్లు విని చదువు పట్ల శ్రద్ధ వహించాలి. మంచి ప్రవర్తన అలవర్చుకుని, జీవిత లక్ష్యంపై దృష్టి సారించాలి. ప్రతి విద్యార్థి 4 సిలకు దూరంగా ఉండాలి. సెల్‌ఫోన్, సినిమాలు, చాటింగ్, క్రికెట్. వీలైనంత వరకు వీటికి దూరంగా ఉన్నప్పుడే ఉన్నతంగా రాణించగలరు. అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించినప్పుడే లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుంది. ప్రతిరోజూ 30 నిమిషాల సమయం ఆటలకు కేటాయించాలి. కౌమార దశలో ఉన్న వ్యక్తిని 10–19 సంవత్సరాల మధ్య వయస్సు చాలా కీలకమైన దశగా చెప్పవచ్చు.

– పెద్దిగారి లక్ష్మన్న, సైకాలజిస్టు, కర్నూలు

మితిమీరిన విశ్వాసం తగదు



పదవ తరగతి తర్వాత కొత్త ప్రపంచంలోకి అడుగుపెడతారు. చదువును పక్కనపెట్టి ప్రేమ, సినిమాలు, షికార్లు, స్నేహం వైపు దృష్టి మరలుతుంది. దీంతో భవిష్యత్తు నాశనం అయ్యే అవకాశాలున్నాయి. తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం. అంతా తమకే తెలుసనే భావనతో విద్యార్థులు అతి విశ్వాసానికి పోతుంటారు. దీన్ని తల్లిదండ్రులు కనిపెడుతూ, అవసరమైనప్పుడు వారికి మంచి నడవడికను అలవర్చాలి.

– ప్రభుచరణ్, గణిత అధ్యాపకులు, కేవీఆర్ కాలేజ్, కర్నూలు

కలలను సాకారం చేసుకోవాలి



దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పినట్లు కలలు కనాలి.. వాటిని సాకారం చేసుకోవాలి. ఇందుకు విద్యార్థులు పట్టుదలతో కృషి చేయాలి. అప్పుడే ఏదైనా సాధించవచ్చు. మొదట చదవడం కష్టంగా ఉంటుంది. అలవాటు చేసుకుంటే పుస్తకాలతో కుస్తీ పట్టడం చాలా సులువే. – గురవయ్య శెట్టి, ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి, కర్నూలు

పోస్టింగ్‌ల కోసం పైరవీలు!

- ప్రభుత్వం మారడంతో ప్రధాన పోస్టులపై గురి
- టీడీపీ నేతల చుట్టూ తిరుగుతున్న కొందరు పోలీస్ అధికారులు
- కర్నూలు డీఎస్పీ పోస్టు కోసం నలుగురు పోటీ
- కర్నూలు పీఎస్‌లలో మైనార్టీ అధికారులు వద్దన్న నేత



కర్నూలు: ఎన్నికల ఫలితాలు వెలువడి అధికార మార్పిడి జరగడంతో తమకు ప్రాధాన్య పోస్టింగులు ఇవ్వాలని కోరుతూ పలువురు పోలీసు అధికారులు కొత్త ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరు తమకు పరిచయం ఉన్న టీడీపీ నాయకుల ద్వారా మంతనాలు నడుపుతున్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం దాదాపు 20 మందికి పైగా జిల్లాలో పనిచేసిన ఎస్‌హెచ్‌ఓలు పొరుగు జిల్లాలకు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో ఇతరులు వచ్చారు. తిరిగి తమ పోస్టింగులు తమకు ఇవ్వాలని కోరుతూ టీడీపీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. విజిలెన్స్, డీసీఆర్‌బీతో పాటు మరి కొన్ని లూప్‌లైన్ విభాగాల్లో పనిచేస్తున్న కొందరు ఇన్‌స్పెక్టర్లు కూడా జిల్లాలోని ముఖ్య సర్కిళ్లలో పోస్టింగులు దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు. సీఐడీ విభాగంలో పనిచేసిన ఒక అధికారి జోన్ డీఎస్పీగా నియమించుకునేందుకు 'పెద్దాయన' అంగీకారం తెలిపినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కర్నూలు డీఎస్పీ పోస్టు కోసం..

కర్నూలు డీఎస్పీ పోస్టును దక్కించుకునేందుకు నగరంలో పనిచేసిన పూర్వపు అధికారులు నలుగురు పోటీ పడుతున్నారు. గతంలో రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐగా పనిచేసి పదోన్నతిపై విజయవాడలో లూప్‌లైన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డీఎస్పీతో పాటు కర్నూలు బెటాలియన్స్‌లో పనిచేస్తున్న మరో డీఎస్పీ, ఎన్నికల ముందు జిల్లాకు బదిలీపై వచ్చి మహిళా విభాగంలో పనిచేస్తున్న మరో అధికారి కర్నూలు డీఎస్పీ పోస్టు కోసం పావులు కదుపుతున్నారు. వీరికి టీడీపీ ముఖ్య నేతలతో మంచి సంబంధాలే ఉన్నాయి. దీంతో వారి పేర్లను పరిశీలిస్తామని నేతలు హామీ ఇచ్చినట్లు పోలీసు అధికారుల్లో చర్చ జరుగుతోంది.

ప్రసన్నం చేసుకునే యత్నాలు

కొత్తగా ఎంపికైన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులను మర్యాదపూర్వకంగా కలసి ప్రసన్నం చేసుకునేందుకు పోలీసు అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులు కూడా నేతల ఇళ్ల వద్దకు వరుస కడుతున్నారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందారు. పాణ్యం, కోడుమూరుకు సంబంధించిన కొన్ని గ్రామాలు, వార్డులు కూడా కర్నూలు కార్పొరేషన్ పరిధిలో ఉన్నాయి. నగరంలో మొత్తం ఐదు పోలీస్ సర్కిళ్లు ఉండగా ఆయా సర్కిళ్లలో పోస్టింగులు దక్కించుకునేందుకు ఎన్నికల ముందు జిల్లాలో పనిచేసిన పోలీసు అధికారులు మూడు రోజులుగా నేతలను కలసి శుభాకాంక్షలు తెలపడంతో పాటు పోస్టింగుల అంశాన్ని ప్రస్తావిస్తున్నట్లు సమాచారం. ఇలాంటి వారిలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కీలక స్థానాల్లో పనిచేసినవారు కొందరు ఉండగా ప్రస్తుతం జిల్లాలోనే లూప్‌లైన్ విభాగాల్లో పనిచేస్తున్నవారు మరికొందరు ఉన్నారు. ప్రస్తుత ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునేందుకు తెర వెనుక ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నట్లు పోలీసు శాఖలో చర్చ జరుగుతోంది.

విధేయులం..మమ్మల్ని మరవొద్దు

కర్నూలు లూప్‌లైన్ విభాగంలో పనిచేస్తున్న ఓ మహిళా ఇన్‌స్పెక్టర్‌తో పాటు టీడీపీ హయాంలో పనిచేసిన శ్యాండ్ అధికారిగా పేరుగాంచిన మరో ఇన్‌స్పెక్టర్ కర్నూలు అర్బన్ తాలూకా ఇన్‌స్పెక్టర్ పోస్టును దక్కించుకునేందుకు నేతలకు టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. అలాగే కర్నూలు విజిలెన్స్, డీసీఆర్‌బీ విభాగాల్లో పనిచేసిన ఇన్‌స్పెక్టర్లు కూడా ప్రధాన సర్కిళ్లలో తిష్ట వేసేందుకు అధికార పార్టీ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పోలీసు అధికారుల్లో చర్చ జరుగుతోంది. ఎన్నికల సమయంలో కొందరు పోలీసు అధికారులు పరోక్షంగా, మరికొందరు తెర వెనుక టీడీపీ నేతలకు సహకారం అందించారు. నగదు తరలింపు, పంపిణీలో తోడ్పాటు అందించడంతో కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులు లాభపడ్డారు. అలాంటి అధికారులు కూడా తమ సీటును పదిలం చేసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కర్నూలులోని ఓ పోలీసు అధికారి టీడీపీ అభ్యర్థి సేవలో తరించారు. ఆ పార్టీకి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారు. పోలింగ్ సమయంలోనూ టీడీపీకి అనుకూలంగా పనిచేస్తున్నట్లు ఆ శాఖ ఉన్నతాధికారులకే ఫిర్యాదులు అందాయి. ఎన్నికల్లో విధేయత చూపినందుకు మళ్లీ ఇక్కడే పోస్టింగ్ దక్కించుకునేందుకు ఆయన పావులు కదుపుతున్నారు.

చురుగ్గా రుతుపవనాలు

- 14 మండలాల్లో వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): రుతు పవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఈ ప్రభావంతో ఖరీఫ్ మొదలైన మొదటి వారంలోనే జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. రానున్న రోజుల్లో కూడా వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉంది. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు 14 మండలాల్లో వర్షాలు కురిశాయి. నాలుగైదు మండలాల్లో భారీ వర్షాలు పడ్డాయి. పత్తికొండలో అత్యధికంగా 60.8 మి.మీ, అత్యల్పంగా కోసిగిలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం సగటున 13.7 మి.మీ వర్షం కురిసింది. జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 మి.మీ ఉండగా ఎనిమిది రోజుల్లోనే 71.8 మి.మీ వర్షపాతం నమోదు కావడం విశేషం. శుక్రవారం సాయంత్రం నుంచి కూడా ఉరుములు, మెరుపులతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. మద్దికెర, ఆస్పరి, కౌతాళం, ఆలూరు సి.బెళగల్ తదితర మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు పడ్డాయి. జిల్లా వ్యాప్తంగా చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. వర్షాధారం కింద వివిధ పంటల సాగు ముమ్మరంగా సాగుతోంది.

మండలం	వర్షపాతం(మి.మీ)
పత్తికొండ	60.8
చిప్పగిరి	58.6
తుగ్గలి	56.2
మంత్రాలయం	52.2
ఓర్వకల్లు	48.2

ముగ్గురు డిగ్రీ విద్యార్థులు డిబార్

కర్నూలు కల్చరల్: డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో చూచిరాతలకు పాల్పడుతూ ముగ్గురు విద్యార్థులు డిబార్ అయినట్లు రాయలసీమ యూనివర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం సెషన్‌లో జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 1,357 మందికి 1,206 మంది, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన ఆరో సెమిస్టర్ పరీక్షలకు 257 మందికి 235 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. నందికొట్కూరు బసిరెడ్డి డిగ్రీ కళాశాల, తుగ్గలి ఏఎస్ డిగ్రీ కళాశాల, చాగలమర్రి సెయింట్ ఆన్స్ పాఠశాల కేంద్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ముగ్గురు విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

రమణీయం.. సంగమేశ్వరం



వర్షాలు కురుస్తుండటంతో శ్రీశైలం జలాశయానికి వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో సప్తనది సంగమ ప్రాంతంలో కృష్ణాజలాలు స్వల్పంగా పెరిగాయి. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 885 కాగా ప్రస్తుతం 808 అడుగులకు చేరుకుంది. రెండు అడుగుల మేర వరదనీరు జలాశయానికి చేరడంతో సంగమేశ్వరాలయం దిగువన ఉన్న భీమలింగం ప్రాంతం అంతా జలమయంగా మారింది. పచ్చని ప్రకృతి అందాల నడుమ ఉన్న ఈ ప్రాంతం రమణీయంగా కనిపిస్తోంది.

– కొత్తపల్లి

క్లుప్తంగా

మిద్దె కూలి వృద్ధురాలి మృతి



కూలిన మిద్దె

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలో మిద్దె కూలి ఓ వృద్ధురాలు మృతి చెందారు. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వానలకు ఆర్ లక్ష్మీదేవి (65) అనే వృద్ధురాలి మట్టి మిద్దె పూర్తిగా తడిసిపోయింది. శుక్రవారం రాత్రి మళ్లీ వర్షం పడటంతో మిద్దె కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పాణ్యం ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి అంత్యక్రియల నిమిత్తం రూ. 5వేల ఆర్థిక సహాయం అందించారు.

అక్కాబావను చూసేందుకు వచ్చి..



మృతి చెందిన నాగజ్యోతి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో ఉన్న అక్కాబావను చూసేందుకు వచ్చిన ఓ మహిళ విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. ఆదోనికి చెందిన బదినేహాల్ నాగజ్యోతి(36)కి అనంతపురానికి చెందిన కిరణ్‌తో వివాహమైంది. రెండేళ్ల కుమారుడు ఉన్న వీరు బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తారు. వేసవి సెలవులు ఉండటంతో నాగజ్యోతి కోసిగిలోని అక్కాబావ రాధ (ఏఎన్ఎం), విజయ్‌లను చూసేందుకు వచ్చారు. శనివారం వ్యక్తిగత పనుల మీద అక్కాబావ బయటకు వెళ్లడంతో ఇంట్లో ఆమె ఒక్కరే ఉన్నారు. సాయంత్రం బాత్ రూమ్‌లోని వాటర్ హీటర్‌ను ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలో పడిపోయింది. తర్వాత ఇరుగుపొరుగు వారు గమనించి ఆమెను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆదోని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తోబుట్టువును చూసేందుకు వచ్చి ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది.

కాలుష్య కోరలు!

- జిల్లాలోని మునిసిపాలిటీలు, పట్టణాల్లో పెరిగిపోతున్న కాలుష్యం
- హెచ్చుస్థాయిలో వాయు, ధ్వని కాలుష్యం
- ప్రమాదకర స్థితిలో సూక్ష్మధూళికణాల విడుదల
- శ్వాసకోశ వ్యాధులతో ప్రజల ఇబ్బందులు



కర్నూలు నగరంలో పెరిగిన వాహనాల రద్దీ

కర్నూలు(సెంట్రల్) : కాలుష్యం కోరలు చాస్తోంది. గాలి నాణ్యత ఏటేటా క్షీణిస్తోంది. జిల్లాలో కర్నూలు నగరంలో పాటు పలు మునిసిపాలిటీలు, పట్టణాల్లో సూక్ష్మధూళికణాలు పరిమితి కంటే చాలా ఎక్కువ విడుదలవుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడే ప్రమాదం నెలకొంది. వాయు కాలుష్యానికితోడు ధ్వని కాలుష్యం రోజురోజుకు తీవ్రమవుతుండడం ఆందోళన కలిగిస్తోందని కాలుష్యపు నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

జిల్లాలో ఆర్టీసీ బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్రవాహనాలు కలిపి మొత్తం లక్షకుపైగా ఉన్నాయి. ఆయా వాహనాల నుంచి విడుదలయ్యే వాయువులు, పదార్థాలతో వాతావరణం కలుషితమవుతోంది. ముఖ్యంగా గాలిలో ఉండే సూక్ష్మధూళి కణాలు ప్రమాదకరంగా మారాయి. 10 పీఎం (పర్టిక్యూలర్ మ్యాటర్) క్యూబిక్ మీటర్ కంటే తక్కువ సైజులో ఉండే ఈ కణాలు విపరీతంగా గాలిలో విహారం చేస్తున్నాయి. ఇవి ముక్కు ద్వారా నేరుగా మానవుడి ఊపిరితిత్తుల్లోకి చేరుతాయని, తద్వారా శ్వాస సంబంధిత వ్యాధులు విస్తరించే ప్రమాదం ఉందని కాలుష్య నియంత్రణ మండలి శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 10 పీఎం క్యూబిక్ మీటర్ కంటే ఎక్కువ సైజులో సూక్ష్మ ధూళి కణాలు ఉంటే ప్రమాదకరం కాదని, గత నాలుగేళ్ల నుంచి 10 పీఎం క్యూబిక్ మీటర్ కంటే తక్కువ సైజులో ఉండే కణాల విడుదల విపరీతంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికి సూక్ష్మధూళి కణాల ఉత్పత్తి సరాసరిగా 60 పీఎం క్యూబిక్ మీటర్ ఉండాలని, అయితే అది 80-85 పీఎం క్యూబిక్ మీటర్లను దాటిపోయిందని అధికారుల గణంకాలు చెబుతున్నాయి. అలాగే వాతావరణంలో నైట్రోజన్, సల్ఫర్ డైయాక్సైడ్, అమ్మోనియా వాయువుల విడుదల కూడా తారస్థాయికి చేరింది. వీటి విడుదల కూడా ఏయేటికీ పెరుగుతూ పోతోంది. వాహనాల హారన్స్‌తో ధ్వని కాలుష్యం కూడా తారస్థాయికి చేరింది. రాత్రి పూట 45 డెసిబుల్స్, పగటిపూట 55 డెసిబుల్స్ ఉండాల్సి ఉండగా ఇవి సరాసరిగా 70-80 డిసిబుల్స్ మధ్య నమోదవుతున్నాయి.

పర్యావరణ పరిరక్షణకు పూనుకోవాలి



ప్రమాదకర స్థితిలో సూక్ష్మధూళి కణాలు ఉత్పత్తి అవుతున్నాయి. పది మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణంలో సూక్ష్మధూళి కణాలు విడుదల అయి నేరుగా మనుషులు, జంతువుల ఊపిరితిత్తుల్లోకి వెళ్తున్నాయి. తద్వారా శ్వాసకు సంబంధించిన వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నారు. వాహనాల సంఖ్య పెరుగుతుండడంతో శబ్దకాలుష్యం హెచ్చుస్థాయిలో రికార్డు అవుతోంది. ప్రజలు మేల్కొని పర్యావరణ పరిరక్షణ చేపట్టకపోతే భవిష్యత్ అంధకారంగా మారే ప్రమాదం ఉంది.


– బీవై మునిప్రసాదు, ప్రాంతీయ పర్యావరణ ఇంజినీరు, కర్నూలు

శ్వాస కోశ వ్యాధులతో బాధపడుతున్న ప్రజలు

వాతావరణంలో ఉండే సూక్ష్మధూళి, నైట్రోజన్, సల్ఫర్ డయాక్సైడ్‌లు, శబ్దకాలుష్యంతో ప్రజలు శ్వాస సంబంధ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రతియేటా ఆయా వాయువులు అధిక మోతాదులో విడుదల అవుతుండడంతో జిల్లాలో శ్వాసకోశ వ్యాధులతో బాధపడే వారి సంఖ్య కూడా భారీగా పెరిగింది. ప్రధానంగా అస్తమా, బ్లడ్ ప్లేజర్, హార్ట్ సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తులు పనిచేయకపోవడం, లంగ్ క్యాన్సర్ తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని కాలుష్య నియంత్రణ మండలి శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

అదుపు తప్పిన ట్రాక్టర్

- ఎస్ఆర్‌బీసీ కాలువలో పడి యువకుడి మృతి



ఎస్ఆర్‌బీసీ కాలువలో పడిన ట్రాక్టర్



మృతిచెందిన మగ్బుల్ బాషా

మిడుతూరు: ట్రాక్టర్ అదుపుతప్పి ఎస్ఆర్‌బీసీ కాలువలో పడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. శనివారం అలగనూరు గ్రామం శివారులో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే..అలగనూరు గ్రామానికి చెందిన సోఫిసాహెబ్, రమిజాబీ దంపతులకు ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు సంతానం. మూడో సంతానమైన మగ్బుల్ బాషా (27) తన సొంత పొలంలో సేద్యం చేసుకునేందుకు అదే గ్రామానికి చెందిన ఓ రైతు ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. పని ముగించుకుని పొలం నుంచి వస్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి ఎస్ఆర్‌బీసీ కాలువలో పడింది. గమనించిన స్థానికులు చిన్న, అనీస్, రాజేష్ కాలువలో పడిన మగ్బుల్‌బాషాను బయటకు తీయగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని జరిగిన ఘటనపై ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం నందికొట్కూరు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

గర్భిణులకు మరింత మెరుగైన సేవలు

- ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి
- గైనిక్ విభాగంలో నూతనంగా ఐసీయూ ఏర్పాటు



గైనిక్ విభాగం వైద్యులతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనిక్ విభాగంలో పది పడకల ఐసీయూ విభాగాన్ని శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల కోసం ఏర్పాటు చేసిన ఈ ఐసీయూ విభాగం అత్యంత క్రిటికల్ కేసులకు ట్రీట్‌మెంట్ ఇవ్వడానికి ఉపయోగపడుతుందన్నారు. గైనిక్ విభాగంలో అత్యవసర కాన్పుల కేసులకు ట్రీట్‌మెంట్ అందించేందుకు అత్యాధునిక వైద్యపరికరాలతో ఆరు వెంటిలేటర్లు, సక్షన్ ఆపరేటర్లు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఇలాంటివి కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా ఉండవన్నారు. గైనిక్ విభాగంలో మరణాల శాతాన్ని తగ్గించేందుకు ప్రయత్నం చేయాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆసుపత్రిలోని డీఆర్ వన్‌లో, గైనిక్ విభాగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యపరికరాలపై సమీక్ష నిర్వహించారు. గర్భిణుల కేసులను ఆరోగ్యశ్రీలో అప్‌లోడ్ చేయాలని డాక్టర్లకు సూచించారు. అలాగే వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేయడమే తన మొదటి ప్రాధాన్యత అని తెలిపారు. కార్యక్రమంలో గైనిక్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ శ్రీలక్ష్మి, జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ ఇక్బాల్ హుసేన్, అనెస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ విశాల, డాక్టర్ కొండారెడ్డి, డాక్టర్ సుధీర్, ఎమెర్జెన్సీ విభాగం వైద్యులు డాక్టర్ రామ్‌శివనాయక్, ఆసుపత్రి డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

కర్నూలు: కర్నూలు రైల్వేస్టేషన్ శివారులోని బంగారుపేట, ఇందిరాగాంధీ నగర్ మధ్యలో గల రెండు కుళాయిల దగ్గర గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ప్రమాదంలో అతని ముఖం నుజ్జునుజ్జు కావడంతో గుర్తుపట్టని విధంగా ఉంది. స్థానికుల సమాచారం మేరకు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ శేషఫణి రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ కోదండరాముడు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించాడు. సుమారు 30 సంవత్సరాల వయస్సు ఉండి, పింక్ కలర్ అడ్డ గీతలు ఉన్న నలుపు రంగు టీషర్టు, గ్రే కలర్ కాటన్ జీన్స్ ప్యాంటు ధరించాడు. రెండు పొరల ఎర్రటి మొలతాడు ఉంది. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు 9441970940 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని హెడ్ కానిస్టేబుల్ కోదండరాముడు విజ్ఞప్తి చేశారు.

జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన లోకేష్‌రెడ్డి

కర్నూలు(టౌన్): ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు పశ్చిమబెంగాల్‌లోని సిలిగిరిలో జరుగుతున్న జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు కర్నూలు క్రీడాకారుడు లోకేష్‌రెడ్డి ఎంపికయ్యాడు. జూనియర్ కేటగిరి 51 కేజీల విభాగంలో ఎంపికైన ఈ యువకుడిని బీక్యాంప్‌లోని త్రినాథ్ అకాడమీ అధ్యక్షుడు త్రినాథ్ శనివారం ప్రత్యేకంగా అభినందించి ఆర్థిక సహాయం అందజేశారు. జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ కోచ్ నరేంద్ర ఆచారి పాల్గొన్నారు.

మందు బాబుల వీరంగం

- ఒకరికి కత్తితో బెదిరింపు
- మరో ఇద్దరిపై రాడ్లతో దాడి

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని నారాయణపురం గ్రామంలో ఐదుగురు యువకులు మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. ఒకరిని కత్తితో బెదిరించడంతో పాటు మరో ఇద్దరిపై రాడ్లతో దాడి చేశారు. ఈ సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు...నారాయణపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమీపంలోని ఖాళీ స్థలంలో ఐదుగురు యువకులు మద్యం తాగుతున్నారు. అటుగా వెళ్తున్న జీసీ పాలెం గ్రామానికి చెందిన అంజన్‌రావును అడ్డగించి కత్తితో బెదిరించారు. విషయం తెలుసుకున్న శ్రీనివాసులు, రాములు విడిపించేందుకు వెళ్లగా వారిపై కూడా ఇనుప రాడ్లతో దాడి చేసి గాయపరిచారు. తర్వాత అక్కడి నుంచి పరారయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అక్కడ ఉన్న ఆటోను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని పలు గ్రామాల్లోని శివారుల్లో బహిరంగంగానే మద్యం సేవిస్తున్నారని, పోలీసులు నిఘా పెంచి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తజన సందడి



ప్రత్యేక అలంకరణలో మద్దిలేటి నరసింహస్వామి

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్య క్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి కనిపించింది. జ్యేష్ఠ మాసం శుభ దినాలను పురస్కరించుకొని జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వీరంతా వేకువజామున ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి , అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి, వరపూజ నిర్వహించి మొక్కులు చెల్లించారు.



స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు

కొర్ర విత్తు.. సరికొత్తగా



రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్నారు. విత్తనం మొదలు అన్ని రకాల సేద్యపు పనులకు యంత్రాలను వినియోగిస్తున్నారు. అయితే, సజ్జ, కొర్ర, పత్తి విత్తనాలు విత్తేందుకు చాలా మంది ఎద్ల కాడి ఉపయోగిస్తారు. అయితే, ఈ పద్ధతిలో సాగుకు ఖర్చు పెరగడంతో పాటు అధిక సమయం పడుతుంది. ఈ క్రమంలో శనివారం ఓ రైతు కోడుమూరు శివారులో ట్రాక్టర్‌కు గొర్రు, గుంటిక ఏర్పాటు చేసి కొర్ర విత్తనం వేసి ఔరా అనిపించాడు. – కోడుమూరు రూరల్

కొండచిలువ కలకలం



శ్రీశైలం : 12 అడుగుల భారీ కొండచిలువ శనివారం పాతాళగంగ మెట్ల మార్గంలో నివసిస్తున్న జె.శేఖర్ ఇంటి వద్ద కనిపించడంతో చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్థానికులు స్నేక్ క్యాచర్ రాజాకి సమాచారమివ్వడంతో ఆయన అక్కడికి చేరుకుని చాకచక్యంగా కొండచిలువను పట్టుకుని డంపింగ్ యార్డులోని రాజన్న కుంట అడవిలో వదిలేశారు.